క్లుప్తంగా

తోటాడ ఉప సర్పంచ్‌గా హేమ



తోటాడ ఉప సర్పంచ్ హేమను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని తోటాడ పంచాయతీ ఉప సర్పంచ్‌గా కోట్ల హేమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతవరకు ఉప సర్పంచ్‌గా పనిచేసిన కొత్తలంక లక్ష్మి పదవీకాలం ముగియడంతో బుధవారం హేమను పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఉప సర్పంచ్ పదవికి అనుకున్న ఒప్పందంలో భాగంగా మొదటి రెండున్నరేళ్లు లక్ష్మి మిగిలిన రెండున్నరేళ్ల పాటు హేమను కొనసాగించేలా పాలకవర్గ సభ్యులు గతంలో ఒడంబడిక చేసుకున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ హేమను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాయకరావుపేట : ఈ నెల 5 వ తేదీన శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేట, శ్రీరాంపురం, కొరుప్రోలు ఫీడరుల నందు చెట్టులు కొమ్మలు నరికివేయడం కోసం ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆ రోజు శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కేశవరం, రాజవరం, గజపతినగరం, రాజానగరం, వెంకటనగరం, కుమారపురం, రత్నయ్యమ్మపేట, రాజగోపాలపురం, పెదరాంభద్రపురం, పాల్తేరు పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పి.ఆనందపురం పాలసంఘ అధ్యక్షునిగా ఉస్తేల్‌నాయుడు



ఆనందపురం పాలసంఘ అధ్యక్షునిగా బాధ్యతలు చేపడుతున్న ఉస్తేల్‌నాయుడు

మునగపాక : పల్లపు ఆనందపురం పాలసంఘ అధ్యక్షునిగా కర్రి ఉస్తేల్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ డెయిరీ మేనేజర్ రమణ, సూపర్‌వైజర్ ఆది అప్పారావు పర్యవేక్షణలో బుధవారం పాల సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్తేల్‌నాయుడును రైతులు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా ముత్యాల మంగతల్లి, గొంతిన అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఉస్తేల్‌నాయుడు మాట్లాడుతూ రైతులకు విశాఖ డెయిరీ ద్వారా మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉపాధి కూలీలకు చెల్లింపులు చేయాలి



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఎస్.రాయవరం : వమ్మవరం గ్రామంలో 9 వారాలుగా ఉపాధి కూలీలకు చెల్లింపులు చేయలేదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ తెలిపారు. వమ్మవరం సచివాలయం వద్ద ఉపాధికూలీలతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. కూలి పనులు చేసుకునేవారికి వారాలు తరబడి చెల్లింపులు చేయకపోతే ఎలా అని మండిపడ్డారు. తక్షణమే అధికారులు స్పందించి ఉపాధి కూలి నగదు చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో సోమిదేవపల్లి ఫీడర్ మెయింటెనెన్స్ పనులు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అనకాపల్లి డీఈ రాజశేఖర్ చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అయితే ఈ ఫీడర్‌పై యలమంచిలి మున్సిపాలిటీ వాటర్ సంపు, కొరుప్రోలు వాటర్ లైను ఉన్నాయని, ఆ పరిధిలో గ్రామాలతో పాటు వాటర్ స్కీమ్ సరఫరాకి ఆటకం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మహిళలపై దాడి ఘటనపై వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. పలు అంశాలపై అధికారులను సభ్యులు నిలదీశారు. సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశం జరగగా జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్. సీతారామరాజు శాఖలవారీ సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024 ఆర్థిక సంవత్సరానికి రూ.18 కోట్లు లక్ష్యంగా కాగా రూ.14 కోట్ల పనులు పూర్తి చేసినట్టు ఏపీవో గంగునాయుడు వివరించారు. గతంలో తీర్మానం చేసిన పంట కాలువ పనులు ఎందుకు చేయలేదని జెడ్పీటీసీ ఉమాదేవి ప్రశ్నించారు. వర్షాకాలం రాకముందే పంట కాలువ పనులు పూర్తి చేసి ఉంటే రైతులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఎంతసేపూ చెరువుల్లో పూడికతీత పనులు మాత్రమే చేస్తున్నారని, పంట కాలువ పనుల జోలికి పోవడం లేదని ఎంపీటీసీ పుట్రేవు వెంకట సూర్యారావు ఆరోపించారు. ఖరీఫ్ సీజనులో 1638 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఏవో సరోజిని తెలిపారు. కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకుంటేనే అన్ని సదుపాయాలు కలుగుతాయని వివరించారు. విద్యార్థులకు సకాలంలో ధ్రువ పత్రాలు అందేలా చర్యలు తీసుకున్నామని తహసీల్దారు బి.వి.రమణ తెలిపారు. భూముల రీసర్వే మండలంలో 13 గ్రామాలలో పూర్తయినట్టు వివరించారు. మండలంలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉందని, మిగులు భూములను గుర్తించి నివేదిక తయారు చేస్తామని తెలిపారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డీపట్టా భూములు ఎక్కువగా అన్యాక్రాంతమయ్యాయని, వాటిపై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నదుల్లో వంతెనల కింది ఇసుక తవ్వకాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోందని, నిరోధానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కోటవురట్ల మర్రిచెట్టు ప్రాంతంలో ఇద్దరు ఒంటరి మహిళలపై సుమారు 50 మంది మూకుమ్మడి దాడి చేసి దుస్తులు చింపి గాయపరచడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. దీనిపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కోరారు. ఆర్‌అండ్‌బీ స్థలం విషయంలో వివాదం జరిగింది కాబట్టి ఆ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు ఎందుకు తీసుకోలేదని, ఎవరి నుంచైనా ఒత్తిడి ఉందా అని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించి మహిళల తరపున 3 సెక్షనులు, ప్రతి వర్గం తరపున ఒక సెక్షనులో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమణయ్య వివరించారు. మహిళలపై 50 మంది వరకు దారుణంగా దాడి చేయగా ప్రతి వర్గం ఫిర్యాదు ప్రకారం ఆయుధాలతో దాడి చేసినట్టుగా ఎలా సెక్షను నమోదు చేశారని ఎస్ఐను ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీలో ప్రోటోకాల్ పాటించకుండా అధికారులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని నీలిగుంట, పాములవాక, చినబొడ్డేపల్లి సర్పంచులు వరహాలబాబు, సత్యవతి, శివరామ్ ఆరోపించారు. పాములవాకలో తనను నామమాత్రంగా ఓ చోటకు పిలిచి, మరోచోట టీడీపీ నాయకులతో పంపిణీ చేసి అవమానించారని సర్పంచ్ సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, తహసీల్దారు బి.వి.రమణ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్షిత నీరు, ఆహారంతో అతిసార దూరం



పెనుగొల్లు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేశ్వరి

ఎస్.రాయవరం : అతిసార వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. డయేరియా మాసోత్సవాలు సందర్భంగా పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కావడం వల్ల డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో రక్షిత మంచి నీటి పథకాల్లో సమయానుకూలంగా క్లోరినేషన్ చేయాలని సూచించారు. ట్యాంకులపై క్లోరినేషన్ తేదీలు రాసి, మరళా నిర్ణయించిన సమయానికి క్లోరినేషన్ జరిగేలా చూడాలన్నారు. అతిసార బారిన పడిన వారు నిర్లక్ష్యం చేస్తే టైఫాయిడ్, కామెర్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాగే కలుషిత ఆహారం తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉమ్మలాడలో దుర్గాలమ్మతల్లి పండగ



ఉమ్మలాడలోని దుర్గాలమ్మ తల్లి

మునగపాక : ఉమ్మలాడలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఉత్సవాన్ని గ్రామస్తుల సహకారంతో ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి దుర్గాలమ్మ తల్లిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

వరాహనదికి జలకళ



వరాహనదిలోకి చేరుతున్న వరదనీరు

కోటవురట్ల : చాలా కాలానికి వరాహనదికి జలకళ వచ్చింది. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలోకి క్రమేపీ వరదనీరు చేరుతోంది. మొన్నటి వరకు ఎండిపోయి ఎడారిని తలపించిన వరాహనది ప్రస్తుతం జలకళతో కనువిందు చేస్తోంది. రోజు రోజుకు వరదనీటి మట్టం పెరిగే అవకాశం కనిపిస్తోంది. పాతరోడ్డు వద్ద వరాహనదిలో సర్పానది సంగమంతో మరింత ఉధృతి కనిపిస్తోంది. చాలా కాలానికి వరాహనదిలోకి నీటి ప్రవాహం రావడంతో పరీవాహక ప్రాంత రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అడుగంటిన భూగర్భ జలాలు పుంజుకునే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

ధార్మిక సమితులు బలపడాలి



కొండకర్ల రామాలయంలో సమావేశమైన సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం : గ్రామాల్లో ధార్మిక సమితులు బలంగా ఉండాలని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి రమణ అన్నారు. మండలంలోని కొండకర్ల రామాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామూహిక హారతి, నగర సంకీర్తన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, బోడపల్లి సత్యం, కట్టమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ



పర్యావరణం పరిరక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ గిరీష్‌కుమార్ సూచించారు. స్థానిక ఉడ్‌పేట స్కూల్‌లో చిన్నారులతో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ప్లకార్డులతో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తుందన్నారు. భూగర్భ జలాలు కలుషితమవడంతోపాటు, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఉపకరణాలను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పాఠశాల భవనం

పాయకరావుపేట : పట్టణంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్ల దృష్ట్యా మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇదే పాఠశాల్లో బాలికల జూనియర్ కళాశాల కూడా నిర్వహిస్తున్నారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించడం తగదు

అనకాపల్లి: వర్షాకాలంలో సీజనల్ రోగాలతో వైద్యం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగుల పట్ల ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కొత్తగా అస్పత్రికి వచ్చిన 15 మంది పీజీలతో పాటు రెగ్యులర్ వైద్యులు కూడా ఇదే తీరున ప్రవర్తించడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా కాస్త ఎదురుతిరిగి మాట్లాడితే విశాకలోని కేజీహెచ్‌కు రిఫర్ చేస్తామని చెప్పడంతో రోగులు, వారి బంధువులు భయపడుతున్నారని ఆక్షేపించారు. కలెక్టర్, వైద్య శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి, మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని కోరారు.

నేడు లక్ష్మీనృసింహుడికి స్వర్ణ సంపెంగలతో అర్చన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం తెల్లవారు జామున స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన జరపనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు అరవెల్లి సత్యప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్య సంరక్షణ

తుమ్మపాల: డెంగ్యూ, డయేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వాణిజగదీశ్వరి, సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని మార్టూరు, తుమ్మపాల గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం, కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కుళాయిలు, బోర్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు నీటిలో కిరోసిన్, వాడేసిన ఇంజిన్ ఆయిల్ చల్లడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. జ్వర లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగు పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది, వైద్య సిబ్బంది ద్వారా నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.సంగం, ఆర్‌వీ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు ఎస్.ఈశ్వరరావు, బి.మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నవ్య, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ శ్రావణ్, ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు : సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలను గుర్తించడం ద్వారా ఇతరులకు వ్యాధి సంక్రమించకుండా చర్యలను తీసుకోవచ్చని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ తెలిపారు. పాత వలసలో బుధవారం సర్పంచ్ జామి శ్రావణ్‌తో పాటు వైద్య సిబ్బంది సికెల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ వ్యాధి చికిత్సకు సరైన మందులు లేనందున, బాధితులను గుర్తించి వారి మధ్య వివాహాలు నిరోధించడం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తిని నివారించే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారికి శరీరంలో గల రక్తం చిక్కబడుతుందని, వారు శ్వాశ సంబంధిత వ్యాధులను ఎదుర్కోవలసిన పరిస్థితి ఉంటుందని ఆయన తెలిపారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి

కె.కోటపాడు : 0–5 ఏళ్ల మధ్య వయసు గల చిన్నారుల్లో వ్యాధులను ఎదుర్కోగలిగే శక్తి సమకూరేందుకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలను తల్లిదండ్రులు వేయించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్. రాజు తెలిపారు. చౌడువాడలో చిన్నారులకు బుధవారం వ్యాధినిరోధక టీకాలను వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల ద్వారా మంచి ఆరోగ్యంతో పాటు వయస్సుకు తగ్గ బరువు, ఎదుగుదల ఉంటుందని వివరించారు. గర్భిణులు ధనుర్వాతం వ్యాధి బారిన పడకుండా టీకాలు వేశారు. ఏఎన్ఎం సన్యాసమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి

కె.కోటపాడు : ఉపాధి హామీ పథకం పనులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డీఆర్పీ ఎ.వెంకటలక్ష్మి తెలిపారు. వారాడ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ గ్రామసభను బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఆర్పీ మాట్లాడుతూ రూ.1,10,44,000 తో 49 పనులు పూర్తి చేసినట్టు వివరించారు. వీటితో పాటు 424 మంది పింఛన్ దారులకు రూ.67,47,000 మంజూరైనట్టు చెప్పారు.

శిథిలావస్థలో తుపాను షెల్టరు



శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టరు పక్కనే ఉన్న పాఠశాల

పాయకరావుపేట : మండలంలో కుమారపురం గ్రామ శివారు గ్రామమైన పెద్దూరు రత్నయ్యమ్మపేట గ్రామంలో తుపాను షెల్టరు భవనం శిథిలావస్థకు చేరుకుని నిరూపయోగంగా పడి వుంది. కొన్ని సంవత్సరాలుగా ఈ తుపాను షెల్టరు భవనం నిరుపయోగంగా పడి ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కాగా తుపాను షెల్టరును ఆనుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వుంది. ఈ పాఠశాల్లో 60 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒకటో తరగతి నుండి 5 వ తరగతి వరకు ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఈ పాఠశాల మాత్రం శిథిలావస్థకు చేరుకున్న తుపాను షెల్టరు కింద ఉండడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులవుతున్నారు. ఎంతో కాలంగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలాతుందోనన్న భయంతో దినదినగండంగా ఉపాధ్యాయులు ఉన్నారు. నిత్యం విద్యార్థులు పాఠశాల ఆవరణలోను, ఈ తుపాను షెల్టరు కిందే సంచరించడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న భయంతో దిగులు చెందుతున్నారు. విద్యార్థులకు విరామ సమయంలోను, పాఠశాలకు వెళ్లేటప్పుడు కూడా ఈ భవనం కింద నుండే వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న తుపాను షెల్టరును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అవార్డు పొందిన ఉపాధ్యాయినికి సత్కారం



డీఈవో అభినందనలు అందుకుంటున్న ఉపాధ్యాయిని స్వర్ణగౌరి

ఎస్.రాయవరం : ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం సర్వేలో ఉమ్మడి విశాఖ జిల్లాలో మొదటి బహుమతి పొందిన రేవుపోలవరం గణిత ఉపాధ్యాయులు స్వర్ణగౌరిని జిల్లా విద్యాశాఖాధికారిని వెంకటలక్ష్మమ్మ ఘనంగా సత్కరించి అభినందించారు. బుధవారం అనకాపల్లి సత్కారం అందుకున్న స్వర్ణ గౌరిని మండల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు ఉపధ్యాయ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. గ్రామీణ పాఠశాలలో ఉపాధ్యాయురాలికి ఉత్తమ అవార్డు గర్వకారణం అన్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చోడిపల్లి అప్పన్న ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. తమ గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయురాలికి ప్రథమ బహుమతి రావడం తమ గ్రామానికి గర్వకారణమన్నారు. సర్వగౌరికి అభినందనలు తెలిపిన వారిలో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు వీరభద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

పాత వాలాబులో తాగునీటి ఎద్దడి



పాత వాలాబులో పాడైన మంచినీటి పథకం

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ శివారు పాత వాలాబులో గ్రామస్తులను తాగునీటి సమస్య వేధిస్తోంది. గ్రామంలోని రక్షిత నీటి పథకం ఆరు నెలల క్రితం పాడైంది. అప్పటి నుంచి అధికార్లు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసినప్పటికీ రోజుకు ఒక్క గంట మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని వారు తెలిపారు. గ్రామంలో 250 మందికిపైగా నివాసముంటున్నారని, తాగు నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా అధికార్లు స్పందించి, నీటి పథకానికి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర కోరారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి: వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం సదరం స్లాట్ బుకింగ్ సదుపాయాన్ని గురువారం నుంచి ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరాపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలలో ఈ బుకింగ్ ప్రక్రియ చేపడతారన్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని, ఈక్రమంలోనే ముందస్తుగా స్లాట్‌లు బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ స్లాట్ బుకింగ్ చేసుకోవడం ద్వారా వైకల్య నిర్ధారణ పరీక్షలు ఎక్కడ, ఎప్పుడు చేస్తారన్న విషయాన్ని తెలియజేస్తారని, ఆ సమయంలో అక్కడికి వెళ్లాల్సి ఉంటుందని ఇంచార్జ్ ఎంపీడీవో స్పష్టం చేశారు.

దేవస్థానం భూముల కౌలు వేలం



కంచుగుమల్లో దేవదాయ భూములకు వేలం నిర్వహిస్తున్న కార్యనిర్వహణాధికారి కిరణ్మయి

రోలుగుంట : కంచుగుమల రెవెన్యూ పరిధిలో సత్యనారాయణ స్వామి దేవస్థానం భూములను రైతుకు బుధవారం వేలం ద్వారా కౌలుకు ఇచ్చినట్టు కార్యనిర్వహణాధికారి కిరణ్మయి తెలిపారు. సర్వే నంబర్ 18,19,21/2లోగల 3:48 ఎకరాలకు వేలం నిర్వ హించారు. ఈ వేలంలో ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. వీరిలో గ్రామానికి చెందిన పరవాడ సత్యనారాయణ భార్య పార్వతి రూ.13,000 అధికంగా పాడి పాటను దక్కించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి ప్రకటించారు. పాటపాడుకున్న పార్వతి ఆధీనంలో మూడు సంవత్సరాల పాటు భూమి ఉంటుంది. పర్యవేక్షణాధికారిగా బలిఘట్టం గ్రూపు టెంపుల్స్‌కార్యనిర్వహణాధికారి కె.దివ్యతేజ వ్యవహరించారు. సిబ్బంది భాస్కరాచారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం



కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కశింకోట: కశింకోటలో బుధవారం చాలా సేపు వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షం వల్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. చెరకు తోటలకు, ఖరీఫ్ వరి సాగుకు దుక్కి చేసుకోవడానికి ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.